క్లుప్తంగా

'సౌందర్యలహరి' పుస్తకావిష్కరణ నేడు

మద్దిలపాలెం: విశాఖ సాహితీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో శుక్రవారం సౌందర్యలహరి పుస్తకావిష్కరణ సభ జరగనుందని తెలుగుదండు పద్య పీఠం ప్రతినిధి పరవస్తు ఫణిశయన సూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. సమస్యాపృచ్ఛక చక్రవర్తి కంది శంకరయ్య చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరుగుతుందని చెప్పారు. విశిష్ట అతిథిగా ఆధ్యాత్మిక ప్రచారకులు పింగళి జానకీలక్ష్మి హాజరుకానున్నారన్నారు. రచయితలు కవి గాండీవి ఆత్రేయపురపు పాండురంగ విఠల్ ప్రసాద్, వేదుల కామేశ్వర శర్మలతోపాటు సమీక్షకులుగా సాహితీ రత్న డాక్టర్ డి.వి.సూర్యారావు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గోవాలని కోరారు.

నేడు కళాభారతిలో నాటికల ప్రదర్శన

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు సాంఘిక నాటికలు ప్రదర్శించనున్నామని వీఎండీఏ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి చెందిన నాటకశాల నట సేవా సమాజం వారిచే రాయి అనే నాటిక ప్రదర్శించనున్నామని చెప్పారు. ఇఎస్ గోపాలరాజు కలం నుంచి జాలువారిన కథకు గెద్ద వరప్రసాద్ దర్శకత్వం చేయనున్నారన్నారు. నాటికలో 8 మంది నటీనటులున్నారని పేర్కొన్నారు. రెండోదిగా గెద్ద కిషోర్ రచించిన బంధనం నాటికను గెద్ద వరప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించనున్నామన్నారు. దీనిలో ఐదుగురు నటీనటులున్నారని చెప్పారు. ఈ ప్రదర్శనలకు అందరూ ఆహ్వానితులేనని ఆయన అన్నారు.

కృష్ణా కళాశాల లైబ్రరీకి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న మాస్టర్ జగన్నాథం

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడు జగన్నాథం మాస్టర్ తన సొంత నిధులు రూ.50 వేల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. ఈ పుస్తకాలను గురువారం అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ప్రముఖుల జీవితగాథలు, చారిత్రక గ్రంథాలు, తెలుగు సాహిత్య పుస్తకాలను ఇచ్చిన జగన్నాథం మాస్టర్ దాతృత్వం ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. విలువైన ఈ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు కళాశాల గ్రంథాలయాధికారి శ్రీనివాస ప్రసాద్‌కు అందజేశామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రావణకుమార్, అకాడమీ అడ్వైజర్, రవిబాబు, రాజేశ్వరరావు, పోలా ఉమామహేశ్వరరావు, అప్పారావు, జి.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

8న కొండగుడి భక్తులకు మహాన్నదానం

దాబాగార్డెన్స్: రౌండ్ టేబుల్ ఇండియా డబ్ల్యూఆర్ఆర్‌టీ356 ఆర్థిక సహకారంతో ఈ నెల 8న కొండగుడి పండగ సందర్భంగా భక్తులకు మహాన్నదానం నిర్వహించనున్నట్టు ఆంధ్ర, తెలంగాణ రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్వామి వివేకానంద సంస్థలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖపురి మేరీ మాత ఉత్సవానికి సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కొండగుడికి తరలి రానున్న దృష్ట్యా మహాన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కొండగుడికి వచ్చే భక్తులు మహాన్నదానం స్వీకరిస్తారని కోరారు. ప్రతి సంవత్సరం స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు, నిత్యం అన్నదానం నిర్వహిస్తున్న వివేకానంద సంస్థకు అభినందనలు తెలిపారు.

అడుగడుగునా సమస్యలు

- ఎంవీపీ కాలనీలో నత్తనడకన అభివృద్ధి పనులు
- రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్



ఎంవీపీ సెక్టార్-10లో అధ్వానంగా గిరిజన బాలికల వసతి గృహం రహదారి

ఎంవీపీకాలనీ: నగరంలో సుందర కాలనీగా.. శాటిలైట్ సిటీగా పేరొందిన ఎంవీపీ కాలనీలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకప్పుడు చక్కటి రహదారులు, అందమైన పరిసరాలు, స్వచ్ఛమైన పచ్చదనం, చక్కటి ఫుట్‌పాత్‌లు, పార్కులకు ఈ కాలనీ ఎంతో ప్రసిద్ధి చెందింది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, కూడళ్లలో విచ్చలవిడి వ్యాపారం, ఆక్రమణలకు గురైన రహదారులు, ఫుట్‌పాత్‌ల కారణంగా ప్రస్తుతం కాలనీ పరిస్థితి దయనీయంగా మారింది. దీనికి తోడు నత్తనడకన సాగుతున్న టీటీడీ సర్కిల్ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్న ఉషోదయ సర్కిల్, దారుణంగా మారిన పలు రహదారుల వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాలుగా సుందరీకరణ మారుపేరుగా నిలిచిన ఎంవీపీ కాలనీ అనేక సమస్యలతో మసకబారుతోంది.

ఫుట్‌పాత్‌లపై విచ్చలవిడిగా వ్యాపారాలు

ఎంవీపీ కాలనీలోని ప్రధాన కూడళ్లలో ఫుట్‌పాత్ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. ఉదయం, రాత్రి వేళల్లో నిర్వహిస్తున్న టిఫిన్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ దుకాణాల వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. రాత్రి పూట రోడ్లపై రాకపోకలకు తీవ్ర అంతరాయాన్ని కలిగించడంతోపాటు రూ.కోట్లతో సుందరీకరించిన కూడళ్ల అందాన్ని మసకబారుస్తున్నాయి. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్, ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి వెంకోజీపాలేనికి వెళ్లే రోడ్లు, ఏఎస్ రాజా కూడలి నుంచి రామలక్ష్మి అపార్ట్‌మెంట్‌కు వెళ్లే రోడ్డుతోపాటు మరిన్ని రహదారుల్లో ఫుట్‌పాత్ వ్యాపారం పెద్ద ఎత్తున పెరిగింది. టిఫిన్ షాపులు, కొబ్బరికాయల విక్రయాలు, టీ స్టాళ్లు, జ్యూస్ షాపులు ఇలా అన్నీ ఫుట్‌పాత్‌లపైనే నిర్వహిస్తున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారాన్ని అధికారులు నియంత్రించక పోవడమే ఈ పరిస్థితికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.



ఏఎస్ రాజా సర్కిల్‌లో ఫుట్‌పాత్‌ను ఆనుకొని టెంట్ వేసి రాత్రి వేళ విక్రయిస్తున్న టిఫిన్లు



టీటీడీ కూడలిలో వదిలేసిన నిర్మాణ సామగ్రి

అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం

ఎంవీపీ కాలనీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. రూ.కోట్లతో అభివృద్ధి చేస్తున్న టీటీడీ సర్కిల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 6 నెలల క్రితమే కాంట్రాక్టర్ ఈ పనులు ప్రారంభించినా.. నేటికీ ఒక కొలిక్కి రాలేదు. పైగా పనుల కోసం తీసుకొచ్చిన నిర్మాణ సామగ్రిని కూడలిలోనే వదిలేయడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి.

- ఉషోదయ కూడలిలో ఆధునికీకరణ పనులు చేపట్టి రోడ్లు అభివృద్ధి చేసినప్పటికీ వాహనాల రాకపోకలకు అనుగుణంగా డివైడర్లను మార్పు చేయకపోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- ఎంవీపీ కాలనీ సెక్టార్-10లోని గిరిజన బాలికల వసతి గృహం, సెక్టార్-12లోని గాదిరాజు ప్యాలెస్ వెనుక రహదారులు అధ్వానంగా మారి స్థానికులకు నరకం చూపిస్తున్నాయి. వర్షం పడిన ప్రతిసారి ఇవి మునిగిపోతున్నాయి.
- ఆదర్శనగర్‌లో తవ్వి వదిలేసిన వాటర్ పైప్‌లైన్ల గోతులు ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. ఆయా రోడ్ల నిర్మాణం చేపట్టాలని చాలా కాలంగా కోరుతున్నా.. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

7న చిన్న జీయర్ స్వామి రాక

ఎంవీపీకాలనీ: ఈ నెల 7న త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి ఎంవీపీ కాలనీకి తరలిరానున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని స్వామీజీ సందర్శించనున్నారని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. వివిధ ఆలయ కార్యక్రమాల్లో స్వామీజీ పాల్గొంటారని, భక్తులు ఆలయానికి తరలిరావాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

'హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాల సంకలనం రెండో సంచిక మల్టీ డిసిప్లినరీ అండ్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్‌ను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంపై నిర్వహించిన జాతీయ సదస్సు నూతన ఆలోచనలను, విశ్లేషణలను, పరిష్కార మార్గాలను అందించిందన్నారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన నిపుణుల చర్చలు, కీలక ఉపన్యాసాలు విలువైన సూచనలు నూతన విద్యా విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉపయుక్తంగా నిలుస్తాయని చెప్పారు. ఈ పుస్తక సంపాదకులను అభినందించారు. ప్రత్యేక సంచిక సంపాదకులు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, డాక్టర్ బి.ప్రవీణ దేవి, డాక్టర్ ఎం.సాల్మన్ రాజు, ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రిలో నూతన విభాగాలకు మోక్షం

రేపు కొత్త బ్లాక్‌లు ప్రారంభించనున్న ఆరోగ్య శాఖ మంత్రి

సాక్షి ఎఫెక్ట్..



మానసిక ఆస్పత్రిలో నిర్మించిన పిల్లలు, వృద్ధుల చికిత్స విభాగం

బీచ్‌రోడ్డు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.28.60 కోట్లతో పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో అదనంగా నిర్మించిన పిల్లలు, వృద్ధుల మానసిక చికిత్స, పునరావాసం, వ్యసన విముక్తి విభాగాలు ప్రారంభానికి నోచుకోలేదు. దీనిపై 'మోక్షమెప్పుడో..?' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఈ మూడు విభాగాలను శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యదేవ్ ప్రారంభించనున్నారని, ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందినట్లు మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు మంత్రి ప్రారంభిస్తారని, దీనికి సంబంధించిన పనులను చేపడుతున్నట్లు చెప్పారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం కింద ఇచ్చే ఈ శిక్షణ ఒక్కో అంశంలో మూడు నెలలు ఉంటుందన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులని,వివరాలకు 7989572891, 8500502395 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం సంబంధిత ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పొందాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. కెమిస్ట్రీ విభాగంలో గురువారం నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్మెంట్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ రంగంలో నిష్ణాతులతో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజ్ ఆచార్యుడు డాక్టర్ జి.రఘురామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల మాట్లాడుతూ మూడు రోజుల జాతీయ సదస్సులో ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడిటెక్ గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్.పురుషోత్తం, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆచార్య వి.సిద్ధయ్య ఆచార్య కె.బసవయ్య, ఆచార్య శైలజ తదితరులు ప్రసంగించారు.

సీఎంకు పోస్ట్ కార్డుల్లో వినతులు



పోస్టాఫీస్ వద్ద రిజిస్టర్ పోస్ట్ కార్డులతో రామకృష్ణాపురం ప్రాంత వాసులు

అరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురం వాసులు తమ సమస్యల పరిష్కారం కోసం వినూత్నంగా వినతులు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గ్రామ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గురువారం తమ సమస్యలను తెలియజేస్తూ రాసిన పోస్ట్ కార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు శ్రీకృష్ణాపురం పోస్టాఫీస్‌లో రిజిస్టర్ పోస్ట్ చేశారు. గ్రామంలోని సుమారు 600 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించి, శ్లాబులు వేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని ఉత్తరాల్లో కోరారు. గతంలో ఉన్న జీవీఎంసీ కమిషనర్ రామాంజనేయులు ఈ గ్రామంలో ఇళ్ల శ్లాబులు వేసుకోవడానికి అనుమతులు ఇస్తామన్నారని, అనంతరం వచ్చిన కమిషనర్లు మాత్రం అనుమతులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సమీపంలోని అన్ని గ్రామాల్లో శ్లాబులు వేసుకోవడానికి అనుమతులు ఉండి రామకృష్ణాపురానికి మాత్రమే ఇవ్వడం లేదని ఉత్తరాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని సీఎం, డిప్యూటీ సీఎంలను కోరుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు, కాకర గోవిందు, సింహాచలం, చిన్నారావు, నూర్జహాన్, బేగం, నాయుడు పాల్గొన్నారు.

పట్టించుకునే వారేరి..?

- బీచ్ రోడ్డులో కళావిహీనంగా జలకన్యల ఫౌంటెయిన్
- నాచు పట్టిన నీరు.. అధ్వానంగా ఆవరణ
- కానరాని శుభ్రం చేసే సిబ్బంది



ఫౌంటెయిన్ నీటిలో పడేసిన వ్యర్థాలు



బీచ్ రోడ్డులోని జలకన్యల విగ్రహాల వద్ద ఫౌంటెయిన్‌లో మురుగు నీరు

ఏయూక్యాంపస్: సాగర తీరం పొడవునా పర్యాటకులను ఆకట్టుకునేందుకు అనేక కళారూపాలను అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా ఆర్కే బీచ్‌కు కూతవేటు దూరంలో మత్స్యకన్యల విగ్రహాలను నిర్మించి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. గతేడాది వీటికి మరమ్మతులు చేసి ఆధునికీకరించారు. కాలక్రమేణా వీటి నిర్వహణను గాలికి వదిలేశారు. జలకన్యల విగ్రహాలకు మరమ్మతులు చేసిన సమయంలో కొండల పైనుంచి నీరు జారేలా చిన్నపాటి ఫౌంటెయిన్ ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీనిని పట్టించుకునే వారే లేకపోవడంతో పూర్తిగా ఇది మూలకు చేరింది. కేవలం మత్స్యకన్యల విగ్రహాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. విగ్రహం ఎదురుగా నిర్మించిన చిన్నపాటి ఫౌంటెయిన్‌లో నీరు నిలిచిపోయి నాచు పట్టింది. ఈ నీటిలో కవర్లు, ప్లాస్టిక్ సీసాలు పడేయడంతో మురుగుమయంగా మారింది. వర్షం కురిసే సమయంలో ఈ ఫౌంటెయిన్ తొట్టి నీటితో నిండిపోతుంది. దీంతో ఈ ప్రాంతంలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. జలకన్యల చుట్టూ మర్రి మొక్కలు, పలు తీగ జాతుల మొక్కలు మొలిచాయి. వీటిని సత్వరం తొలగించని పక్షంలో ఈ విగ్రహాలకు ముప్పు వాటిల్లే అవకాశముంది.

అధికారులు దృష్టి సారించాలి

లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపట్టిన జలకన్యల విగ్రహాలు, ఫౌంటెయిన్, ఇతర నిర్మాణాలను కాలానుగుణంగా ఆధునికీకరించాల్సి ఉంది. ఈ దిశగా జీవీఎంసీ అధికారులు దృష్టి సారిస్తే పర్యాటకులకు పూర్తిస్థాయిలో ఆహ్లాదాన్ని పంచడం సాధ్యపడుతుంది. విశాఖను ఇతర రాష్ట్రాల పర్యాటకులతోపాటు విదేశీయులు సైతం నిత్యం సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగర తీరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడం, ప్రస్తుతం ఉన్న ఆకర్షణీయ ప్రాంతాలను సక్రమంగా నిర్వహించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించి జలకన్యల ఫౌంటెయిన్‌ను శుభ్రం చేయించాలని సందర్శకులు కోరుతున్నారు.



నాచు పట్టిన నీరు

మానవ పరిణామంలో టెక్నాలజీ కీలకం

మురళీనగర్: మానవుడి పరిణామ క్రమం సైన్స్ అండ్ టెక్నాలజీతో ముడిపడి ఉందని ఎమ్మెల్సీ పి.రవీంద్ర బాబు అన్నారు. కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న ప్రాంతీయ టెక్ ఫెస్ట్ - 2024 ముగింపు సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు శాస్త్రీయమైన భావాలు పెంపొందించుకొని సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ దేశంలో నైపుణ్యంతో కూడిన మానవ వనరుల కొరత ఉందని, నేటితరం యువతీ యువకులు నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. విదేశాలతో పోల్చుకున్నప్పుడు మన దేశంలో 51 శాతం యువత నైపుణ్యం లేనివారు ఉన్నారన్నారు. నైపుణ్య సాధన దిశగా పాలిటెక్నిక్ విద్యార్థులు పయనించాలని సూచించారు. రెండు రోజులుగా నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్‌లో మొదటి రెండు స్థానాలు సాధించిన ప్రాజెక్టులకు నగదు బహుమతులు అందించారు. మొదటి స్థానంలో నిలిచిన ఆల్వార్ దాస్ పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన గ్రావిటేషనల్ బ్యాటరీ ప్రాజెక్టుకు రూ.25 వేలు, రెండో స్థానంలో నిలిచిన కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు రూపొందించిన యూఏవీ ప్రాజెక్టుకు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య, కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, తుమ్మడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మిడి రామ్ కుమార్, సాంకేతిక విద్యాశాఖ కాకినాడ రీజినల్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

నాట్య కళాక్షేత్రం వార్షికోత్సవాలు రేపు

సీతమ్మధార: నాట్య కళాక్షేత్రం 24వ వార్షికోత్సవాలను ఈ నెల 7న పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తామని నాట్య గురువు కె.వెంకట్ వెల్లడించారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సిహెచ్.సన్యాసిపాత్రుడు, కూచిపూడి, భరతనాట్యం ఎక్స్‌పోనంట్(వరంగల్) బి.సుధీర్‌రావు, డ్యాన్స్ ఇండియా మేగజైన్ చీఫ్ ఎడిటర్ బీఆర్ విక్రమ్‌కుమార్, కళాభారతి ట్రస్టీ జీఆర్‌కే ప్రసాద్(రాంబాబు), విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కె.వెంకటరమణారావు, నాట్య రవళి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు యు.మహేష్‌బాబు పాల్గొంటారని చెప్పారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టండి



సుభాష్‌నగర్‌లో పర్యటిస్తున్న జిల్లా మలేరియా శాఖ అధికారి తులసీ రాజ్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్‌లో గురువారం జిల్లా మలేరియా శాఖ అధికారి తులసీ రాజ్ పర్యటించారు. ఈ ప్రాంతంలో మలేరియా కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వార్డులో అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నగేష్ పట్నాయక్, మంగరాజు, రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.